## క్లుప్తంగా

### కబడ్డీ పోటీలు ప్రారంభం



చింతమానులపల్లెలో ప్రారంభమైన కబడ్డీ పోటీలు

**సి.బెళగల్:** మండలంలోని చింతమానుపల్లెలో గ్రామ దేవత మారెమ్మ దేవరా సందర్భంగా గ్రామ ఫ్రెండ్స్ యూత్ సభ్యులు ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు మంగళవారం ప్రారంభం అయ్యాయి. పోటీకు 16 జట్లు నమోదు చేసుకొగా, మొదటి రోజు మొదటి లీగ్‌లో 10 జట్లు పోటీపడినట్లు నిర్వాహకులు తెలిపారు. రెండవ లీగ్ గురువారం నిర్వహించిన అనంతరం సెమీ ఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లను నిర్వహించి, విజేతలకు నగదు బహుమతులు అందజేయడం జరుగుతుందని యూత్ సభ్యులు తెలిపారు.

### టీబీపై అప్రమత్తంగా ఉండాలి



చనుగొండ్లలో రోగులతో వైద్యాధికారులు

**గూడూరు రూరల్:** టీబీ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని టీబీ సూపర్‌వైజర్ నాగ మహేంద్ర పేర్కొన్నారు. చనుగొండ్లలో మొబైల్ ఎక్స్‌రే వ్యాన్ ద్వారా మంగళవారం ఆయన వ్యాధి నిర్ధారణ పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 90 మందికి పరీక్షలను నిర్వహించామని, టీబీ వ్యాధి గ్రస్తులకు ప్రభుత్వం ద్వారా పౌష్టికాహార కిట్టుతో పాటు అవసరమైన మందులను అందిచామని ఆయన తెలిపారు.

### గ్రామాల పరిశుభ్రత అందరి బాధ్యత



పోలకల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న ఈఓఆర్డీ సందీప్

**సి.బెళగల్:** గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యతని ఈఓఆర్డీ సందీప్ అన్నారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని పోలకల్, ముడుమాల, ఈర్లదిన్నె గ్రామాలలో ఆయా గ్రామ సర్పంచ్‌లు చేపట్టిన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఓఆర్డీ మాట్లాడుతూ ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలు వ్యాప్తి చెందవన్నారు.

### విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన ట్రాక్టర్



అదుపు తప్పి కరెంట్ స్తంభాన్ని ఢీకొట్టిన ట్రాక్టర్

**కోడుమూరు రూరల్:** స్థానిక కర్నూలుకు వెళ్లే దారిలో ప్యాలకుర్తి వద్ద ఓ ట్రాక్టర్ అదుపు తప్పి కరెంట్ స్తంభాన్ని ఢీకొట్టిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. ప్యాలకుర్తి గ్రామానికి చెందిన గిడ్డప్ప తన ట్రాక్టర్‌తో గ్రామానికి వస్తుండగా ఎదురుగా వేగంగా వస్తున్న ఆర్‌టీసీ బస్సును తప్పించబోయే పక్కనే ఉన్న కరెంట్ స్తంభాన్ని ఢీకొట్టాడు. వెంటనే కరెంట్ పోవడంతో పాటు, గిడ్డప్ప ట్రాక్టర్‌పై నుంచి దూకేయడంతో క్షేమంగా బయటపడ్డాడు. కరెంట్ స్తంభం విరిగిపోవడంతో ప్యాలకుర్తి గ్రామానికి సుమారు రెండు గంటలకు పైగా కరెంట్ సరఫరా నిలిచిపోయింది. ట్రాన్స్‌కో అధికారులు లైన్లను పునరుద్ధరించి ప్యాలకుర్తికి కరెంట్‌ను సరఫరా చేశారు.

### ప్రశాంత జీవనం గడపాలి



ప్రజలతో మాట్లాడుతున్న ట్రైనీ డీఎస్పీ భావన

**గూడూరు రూరల్:** ప్రతి ఒక్కరూ వివాదాలు, ఘర్షణలు, గొడవలు వంటి వాటి దూరంగా ఉంటూ ప్రశాంతమైన జీవనాన్ని గడపాలని ట్రైనీ డీఎస్పీ భావన సూచించారు. కె.నాగలాపురం పోలీసు స్టేషన్ పరిధిలోని మార్కాపురంలో మంగళవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె ప్రజలతో సమావేశమయ్యారు. ఎన్నికల సమయం కావడంతో ప్రజలందరు ఐక్యమత్యంగా ఉండాలన్నారు. గ్రామంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు, ఘర్షణలకు పాల్పడకుండా ఉండాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే పోలీసులు, అధికారుల దృష్టికి తీసుకునివచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. ఆమె వెంట ఎస్‌ఐ శ్రీనివాసులు ఉన్నారు.

**రేపు రౌండ్ టేబుల్ సమావేశం**

**కర్నూలు(అర్బన్):** రాష్ట్రంలో త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో మాదిగలు, మాదిగ క్రైస్తవులు, మాదిగ ఉప కులాలు ఎటు వైపు అనే అంశంపై ఈ నెల 22వ తేదీ ఉదయం 11 గంటలకు అంబేడ్కర్ భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు రాయలసీమ మాదిగ దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు అనంతరత్నం మాదిగ తెలిపారు.

# వలంటీర్ల సేవలు అద్భుతం

- సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం
- సీఎం జగన్‌తోనే సంక్షేమ పాలన
- 'వలంటీర్లకు వందనం'లో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



గడివేముల వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

**గడివేముల:** వలంటీర్ల సేవలు అద్భుతమని, సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శమని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. గడివేముల ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మంగళవారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. మండలంలో ఉత్తమసేవలు అందించిన 196 మంది వలంటీర్లకు సర్టిఫికెట్, అవార్డులు అందించి శాలువాతో సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ఎలాంటి వివక్ష లేకుండా కేవలం అర్హతే ప్రామాణికంగా పథకాలు అందిస్తూ.. సీఎం జగన్ ఆశయాలకు అనుగుణంగా వలంటీర్లు సైనికుల్లా పనిచేస్తున్నారన్నారు. కరోనా సమయంలో వలంటీర్ల సేవలు ఎనలేనివన్నారు. గతంలో కార్యాలయాల చుట్టూ తిరిగిన పథకాలు అందేవి కాదని సీఎంగా జగన్ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి వలంటీరు వ్యవస్థతో ఇంటి వద్దకే పథకాలు వస్తున్నాయన్నారు. టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల పేరుతో ప్రజలను దోచుకున్నారని విమర్శించారు. లంచాలు, వివక్ష లేకుండా సంక్షేమం, సేవలు అందిస్తున్న ప్రతి ఒక్క వలంటీరుకు బాగా పనిచేస్తున్నారన్నారు. పథకాలన్నీ కొనసాగాలంటే రానున్న ఎన్నికలలో వైఎస్సార్‌సీపీని మళ్లీ గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, ఎంపీపీ నాగమద్దమ్మ, సింగిల్‌విండో చైర్మన్ పోగుల చంద్రశేఖరరెడ్డి, జేసీఎస్ చైర్మన్ నాగేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ కాలునాయక్, ఎంపీడీఓ శివరామిరెడ్డి, సర్పంచ్‌లు రామ్మోహన్‌రెడ్డి, శేఖర్, ఉప సర్పంచ్‌లు బాలచెన్ని, శివానందరెడ్డి, ఎంపీటీసీలు వంగాల మహేశ్వర రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

### మరింత మెరుగ్గా సేవచేస్తాం



నా పరిధిలో ఉన్న కుటుంబాలకు కుటుంబసభ్యురాలిగా సేవలు అందించడంతో ప్రభుత్వం నా సేవలను గుర్తించి సేవారత్న పురస్కారానికి ఎంపిక చేయడం చాల ఆనందంగా ఉంది. దీంతో రూ.30 వేలు ప్రోత్సాహం అందిచడంతో ఇంకా బాగా పనిచేయాలన్న తపన మొదలైంది. నాకు కేటాయించిన ఇళ్లకు మరింత సేవ చేసేందుకు అవార్డు ఎంతగానో ఉపయోగపడుతుంది. మా కుటుంబం తరపున సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు.

–ఆవుల స్వప్న, సేవా రత్నగ్రహీత, బిలకలగూడూరు

# గ్రామ స్వరాజ్యమే ధ్యేయం

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- ఎ.గోకులపాడులో ఆర్‌బీకే, హెల్త్ సెంటర్, వక్కెర వాగుపై బ్రిడ్జి ప్రారంభం



రైతు భరోసా కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

**కల్లూరు:** జాతిపిత మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యామే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఎ.గోకులపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రం, డాక్టర్ వైఎస్సార్ హెల్త్ సెంటర్, వక్కెర వాగుపై నిర్మించిన బ్రిడ్జిని ఎంపీపీ బోయ శారదతో కలసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ/వార్డు సచివాలయాలు ఏర్పాటు చేసి ప్రజల చెంతకే పాలన తీసుకువచ్చామన్నారు. ప్రజలు మండల కార్యాలయాలకు వెళ్లకుండా వారికి కావాలసిన అన్ని సేవలు సచివాలయాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులకు ఎరువులు, మందులు రైతు భరోసా కేంద్రంలో అందుబాటులో తెచ్చమని తెలిపారు.

**ఆరోగ్యానికి పెద్దపీట**

పేదలకు మెరుగైన వైద్యం అందించాలని గ్రామాల్లో డాక్టర్ వైఎస్సార్ హెల్త్ సెంటర్లను ప్రారంభించామని ఎమ్మెల్యే తెలిపారు. ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా మధుమేహం, హిమోగ్లోబిన్, బీపీ, కంటి వంటి మొదలగు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందిస్తున్నామన్నారు. ప్రజల సౌకర్యార్థం వక్కెర వాగుపై బ్రిడ్జి నిర్మించామని చెప్పారు. ఎంత వర్షం కురిసిన ఇప్పుడు గ్రామ ప్రజలకు వరద భయం లేదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గిడ్డమ్మ, ఎంపీటీసీ లక్ష్మిదేవి, గ్రామ నాయకులు మధుసుదన్‌రెడ్డి, హనుమంతురెడ్డి, పురుషోత్తమరెడ్డి, అభివృద్ధి, కార్పొరేటర్ లక్ష్మీకాంతరెడ్డి, మండల నాయకులు కేశవ రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, ఎంపీడీఓ రమణమూర్తి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

### కేసు నమోదు

**గడివేముల:** మండల పరిధిలోని కొరటమద్ది గ్రామానికి చెందిన రాఘవశేషారెడ్డి ఫిర్యాదు మేరకు అదే గ్రామానికి చెందిన కమ్మరి కృష్ణమాచారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బీటీ వెంకటసుబ్బయ్య మంగళవారం తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు తన కళ్లానికి వెళ్తున్న రాఘవ శేషారెడ్డిని పాత కక్షలు మనసులో పెట్టుకున్న కృష్ణమాచారి దుర్భాషలాడి, చంపుతానని కత్తి తీసుకుని వెంటపడగా తప్పించుకుని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

### కూలీల సంఖ్య పెంచాలి



గోరంట్లలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఏపీఓ మోదీన్‌బాషా

**కోడుమూరు రూరల్ :** ఉపాధి పనుల కూలీల సంఖ్యను మరింత పెంచాలని ఏపీఓ మోదీన్‌బాషా సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం మండలంలోని గోరంట్ల గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఏపీఓ తనిఖీ చేశారు. కూలీల హాజరు, మస్టర్లను పరిశీలించారు. ఏపీఓ మాట్లాడుతూ ప్రభుత్వం కరువు మండలాల్లో ఉపాధి కూలీలకు అధనంగా 50రోజుల పనిదినాలను కల్పిస్తోందని, కూలీలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కూలీలంతా నిర్ణయించిన కొలతల ప్రకారం పనులు చేస్తే రోజువారి వేతనం రూ.272లు పడుతుందన్నారు. పెండింగ్‌లో ఉన్న కూలీల వేతనాలన్ని కూలీల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసిందన్నారు. ఎండల దృష్ట్యా కూలీలు ఉదయాన్నే పనుల్లోకి వచ్చి త్వరగా పూర్తి చేసుకుని వెళ్లాలని ఏపీఓ సూచించారు.

### వలంటీర్ల సేవలు వెలకట్టలేవి



వలంటీర్లను సత్కరిస్తున్న ఎంపీపీ సునీత,అదికారులు

**గూడూరు:** వలంటీర్ల సేవలు వెలకట్టలేనివని ఎంపీపీ సునీత అన్నారు. మంగళవారం పట్టణంలోని వైకేపీ సమావేశ హాల్‌లో ఎంపీడీఓ కుమారి జయశ్రీ అధ్యక్షతన రూరల్ పరిధిలోని వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఎంపీపీ మాట్లాడుతూ వలంటీర్ల పనితీరు గొప్పదని , సేవా దృకృథంతో ప్రజలకు సవేలందస్తున్నారని కొనియడారు. ప్రభుత్వ పథకాలను పేదల గడప దగ్గరకు చేర్చుతూ అందరి మన్ననలు పొందుతున్నారన్నారు. వేతనం కోసం కాకుండా సామాజిక దృక్పథంతో వారు పని చేస్తూ అందరి అభిమానం పొందారన్నారు. అనంతరం సేవా వజ్ర అవార్డుకు ఎంపికై న గుడిపాడు గ్రామానికి చెందిన ఎం.కృష్ణకు నగదు తో పాటు ప్రశంసాపత్రం ఇచ్చి శాలువా కప్పి సత్కరించారు. అలాగే సేవా రత్నకు ఎంపికైన బూడిదపాడు శివలక్ష్మి, చనుగొండ్ల మదుకృష్ణ, గుడిపాడు సుంకులమ్మ, మునుగాల వీరేష్, పెంచికలపాడు భార్గవితోపాటు సేవా మిత్ర వలంటీర్లకు అవార్డులు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ మధులత, ఏఓ విజయసింహారెడ్డి, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

### వైభవంగా విగ్రహాల ప్రతిష్ట



బ్యాతోలి గ్రామంలో ప్రతిష్ఠించిన అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న పురోహితులు

**సి.బెళగల్:** మండలంలోని బ్యాతోలి గ్రామంలో మంగళవారం నూతన ఆలయ ప్రారంభోత్సవం, దేవతా విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. అదేవిధంగా గ్రామ శివారులోని మారందొడ్డి గ్రామ రోడ్డులో శ్రీ లక్ష్మమ్మ, బంగారమ్మ దేవతల విగ్రహాలు, గ్రామంలో నంది విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. రాత్రి ఉచిత పౌరాణినాటక ప్రదర్శనను గ్రామ పెద్దలు ఏర్పాటు చేశారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, కోడుమూరు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్

**అమ్మవారిని దర్శించుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు**

కాగా బ్యాతోలి గ్రామంలో జరిగిన విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాల్లో కోడుమూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు. కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్‌కు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయా అమ్మవారి ఆలయాల్లో మండల నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులతో కలిసి పూజలను నిర్వహించి మొక్కులను చెల్లించుకున్నారు. కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ మండల మాజీ కన్వీనర్ నరసింహుడు, నాయకుడు పులిరాజు, సి.బెళగల్ సర్పంచ్ పాండురంగన్న తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యమే సంపద

- జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోండి
- ప్రతి ఒక్కరూ ఉచిత వైద్య పరీక్షలు చేయించుకోవాలి
- డీఎంఅండ్‌హెచ్‌ఓ రామగిడ్డయ్య



ఆరోగ్య సురక్ష శిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా.బి. రామగిడ్డయ్య

**కర్నూలు సిటీ:** ప్రస్తుత పరిస్థితుల్లో ఆరోగ్యంగా ఉండటమే సంపద అని డీఎంఅండ్‌హెచ్‌ఓ రామగిడ్డయ్య అన్నారు. ప్రజారోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని తీసుకొచ్చిందని, దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కర్నూలు రూరల్ మండల పరిధిలోని గార్గేయపురంలో మంగళవారం ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని డీఎంఅండ్‌హెచ్‌ఓ పరిశీలించి అందుతున్న వైద్య సేవలపై ఆరాతీశారు. ప్రతి ఒక్కరికీ ఆరోగ్య పరీక్షలు చేసి, ఏవైనా సమస్య ఉంటే చికిత్స కోసం ఆసుపత్రులకు రెఫర్ చేయాలన్నారు. గర్భిణులు, బాలింతలు, కౌమార దశ బాలికలకు వారు తీసుకోవాల్సిన బలవర్ధక ఆహారం గురించి వివరించాలని వైద్య సిబ్బందికి ఆదేశించారు. రోగాలు ప్రబలకుండా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా పంచాయతీ అధికారులు, ఆశాకార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆరోగ్యం విషయంలో ప్రతి ఒక్కరు జాగ్రత్తలు తీసుకోవాలని, 15 రోజులకు ఒకసారి గ్రామంలోనే వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇస్తారన్నారు. వైద్య పరీక్షలు పూర్తి అయిన తరువాత ఓ ప్రొఫైల్ తయారు చేసి కార్డులు ఇస్తారన్నారు. ఎక్కడికి వెళ్లినా ఆ కార్డు నెంబరు చెబితే చాలని, అందులోనే గతంలో వచ్చిన వ్యాధులు, వాడిన మందులు తదితర వివరాలన్నీ ఉంటాయన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే గా పాటించాలని, అలాగే తాగు నీటి ట్యాంకులను శుభ్రం చేయాలన్నారు. కార్యక్రమంలో గార్గేయపురం పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డా.బి. జయలక్ష్మి, స్పెషలిస్టు డాక్టర్లు డా.పి వర్షిత (కర్నూలు జనరల్ హాస్పటల్, జనరల్ మెడిసిన్), డా.బి. మమత(జనరల్ సర్జరీ), కంటి విభాగం అసిస్టెంట్ ప్రియాంక, ఎంపీహెచ్‌ఓ వెంకట రమణ, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

**నిరుపేదల వరం 'ఆరోగ్య సురక్ష'**

**ఓర్వకల్లు:** ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష పథకం నిరుపేద రోగులకు వరంలాంటిదని జిల్లా రాష్ట్రీయ బాల స్వాస్థ్య (ఆర్‌బీఎస్) కార్యక్రమ అధికారి డా.శైలేష్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని సోమయాజులపల్లె సచివాలయం వద్ద నిర్వహించిన రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష పథకం కింద జరుగుతున్న వైద్య శిబిరాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. జగనన్న ఆరోగ్య సురక్ష పథకం అనారోగ్య సమస్యలు ఉన్న వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. మహిళలు చెప్పుకోలేని వ్యాధులను తొలి దశలోనే గుర్తించి చికిత్స అందిస్తారని, అవసరమైతే పెద్ద ఆసుపత్రులకు తరలిస్తారని తెలిపారు. అదేవిధంగా ఫ్లిప్ బుక్ ద్వారా మహిళలకు రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. రొమ్ము క్యాన్సర్‌ను తొలి దశలోనే గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చన్నారు. రొమ్ములో గడ్డ, కణతి, వాపు, ఎర్రబడడం వంటి లక్షణాలు ఉంటే మమోగ్రామ్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచు జయమ్మ, వైద్య నిపుణులు డాక్టర్ రతన్‌సింగ్, డాక్టర్ సుప్రజ, వైద్యాధికారి డాక్టర్ అమరనాథ్‌రెడ్డి, డాక్టర్ సత్యనారాయణ, ఎంపీహెచ్‌ఈఓ రాబర్ట్ తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో మాట్లాడుతున్న డాక్టర్ శైలేష్‌కుమార్

**వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి**

**కల్లూరు:** ప్రజల సౌకర్యార్థం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆరోగ్య శాఖ మాస్ మీడియా అధికారి ప్రమీల దేవి అన్నారు. మంగళవారం పెద్దటేకూరు గ్రామంలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యులు రఘు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



పెసరవాయి శిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా నోడల్ అధికారి డాక్టర్ జగదీష్ చంద్రారెడ్డి



హెల్త్ క్యాంప్‌లో పేర్లు నమోదు చేయించుకుంటున్న మహిళ

**జగనన్న ఆరోగ్య సురక్షతో అందరికీ ఆరోగ్యం**

**గడివేముల:** ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిరక్షణ కోసమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జగనన్న ఆరోగ్య సురక్ష నంద్యాల జిల్లా నోడల్ అధికారి డాక్టర్ జగదీష్ చంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం గడివేముల మండల పరిధిలోని పెసరవాయి గ్రామ సచివాలయం ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష–2 శిబిరాన్ని వైఎస్సార్‌సీపీ యూత్‌వింగ్ సెక్రటరీ శ్రీకాంత్‌రెడ్డి ప్రారంబించారు. శిబిరాన్ని నోడల్ అధికారి ఆకస్మికంగా తనిఖీ చేసి రోగులతో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేద ప్రజల ఆరోగ్యం కోసం గ్రామాల్లోకే స్పెషలిస్టు డాక్టర్లను తీసుకువచ్చిందని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ మొల్లా జబీన్, పీహెచ్‌ఎన్ సర్వేశ్వరమ్మ, ఎంపీహెచ్‌ఈఓ మహేశ్వరరెడ్డి, సూపర్‌వైజర్ మనోహర్, ఫార్మసిస్ట్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

**కొత్తకోటలో సురక్ష వైద్య సిబిరం**

**సి.బెళగల్:** మండలంలోని కొత్తకోట గ్రామంలో అధికారులు, వైద్యులు రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. హెల్త్ క్యాంప్‌ను ఈఓఆర్డీ సందీప్ పరిశీలించారు. హెల్త్ క్యాంప్‌లో 402 మందికి వైద్య సేవలు అందించినట్లు డాక్టర్ సునీత తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు సింధూర, వాసు, కంటి వ్యాధి నిపుణుడు సంపత్, సీహెచ్‌ఓ ఉమామహేశ్వరి, వైద్య అధికారులు మంగమ్మ, మద్దిలేటి, పంచాయతీ కార్యదర్శులు వలిబేగ్ పాల్గొన్నారు.

### నారాయణ అన్న ప్రసాద వితరణను ఉపయోగించుకోండి

**కర్నూలు(అర్బన్):** బ్రాహ్మణ సేవా సంక్షేమ మిత్ర మండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నారాయణ అన్న ప్రసాద వితరణ సేవను అవసరం ఉన్న ప్రతి బ్రాహ్మణ కుటుంబ సభ్యులు ఉపయోగించుకోవాలని మిత్ర మండలి వ్యవస్థాపక అధ్యక్షుడు సందేల్ చంద్రశేఖర్ కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బ్రాహ్మణ కుటుంబంలో ఎవరైనా మృతి చెందిన రోజున వారి దహన సంస్కారాలు నిర్వహించే వరకు కుటుంబమంతా చాలా బాధలో ఉంటారన్నారు. ఈ నేపథ్యంలోనే ఆ కుటుంబ సభ్యులకు ఒక్క పూట 50 మందికి సరిపడా భోజనాలు ఉచితంగా బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో అందించి సహకరించేందుకు నారాయణ అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. 50 కంటే ఎక్కువ భోజనాలు అవసరమైతే డబ్బులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. అన్న ప్రసాదం కోరు వారు ఉదయం 9.30 గంటల్లోపు ఎన్ని భోజనాలు అవసరమవుతాయనే విషయాన్ని తెలియజేస్తే మధ్యాహ్నం 2 గంటల్లోపు ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే మృతి చెందిన వారి వయస్సు, వివరాలు, ప్రసాదం కోరే వారి సెల్ నెంబర్ పంపాలన్నారు. ఈ పథకాన్ని ధనిక, పేద, స్మార్థ, మధ్వ, శ్రీ వైష్ణవ అనే బేధం లేకుండా ప్రతి బ్రాహ్మణ కుటుంబం ఉపయోగించుకోవాలన్నారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

**గడివేముల:** ఆటోను అతివేగంగా నడుపుకుంటూ వచ్చి బైకును ఢీకొనడంతో వ్యక్తికి గాయాలైన ఘటన మంగళవారం దుర్వేశిబాట వద్ద చోటుచేసుకుంది. ఎస్‌ఐ బీటీ వెంకటసుబ్బయ్య తెలిపిన వివరాల మేరకు.. నంద్యాల మండల పొలూరు గ్రామానికి చెందిన గుండంపాటి సతీష్, జోష్‌మధు బైకు వెళ్తుంగా దుర్వేశి బాట వద్ద ఆటోను డ్రైవర్ సాయి కిరణ్ అతివేగంగా వచ్చి ఢీ కొట్టాడు. దీంతో బైకుపై ఉన్న సతీష్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108 ద్వారా శాంతిరాం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

### ఒకే యాప్‌ను అమలు చేయాలి

**కర్నూలు (న్యూటౌన్):** అంగన్‌వాడీ వర్కర్స్‌ను మానసిక ఒత్తిడికి గురి చేస్తున్న నాలుగు యాప్‌లను రద్దు చేసి ఒకే యాప్ అమలు చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు బాలదుర్గమ్మ, జిల్లా ఉపాధ్యక్షురాలు విజయ, రామాంజనేయులు కోరారు. మంగళవారం సీడీపీఓకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్స్ ఫేస్‌యాప్ సరిగా పని చేయడంలేదని, అధికారులు చేసే ఒత్తిడితో మానసిక ఒత్తిడి పెరిగి అనారోగ్యాలకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ మహేశ్వరి, కృష్ణవేణి, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

### భగవద్గీత వ్యాప్తికి కృషి చేయాలి



భగవద్గీత సామూహిక పారాయణం చేస్తున్న ధార్మిక సంస్థల సభ్యులు

**కర్నూలు కల్చరల్:** సకల సమస్యలకు పరిష్కారం చూపే భగవద్గీత వ్యాప్తికి అన్ని విద్యాసంస్థలు, ధార్మిక సంస్థలు, దేవస్థానాలు కృషి చేయాలని గీతా ప్రచార సంఘం అధ్యక్షుడు డి.వి.రమణ అన్నారు. మాఘ శుద్ధ భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని సంకల్‌బాగ్‌లోని శ్రీగీతా ప్రచార ధామంలో మంగళవారం సంపూర్ణ భగవద్గీత పారాయణ యజ్ఞం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గీతాప్రచార సంఘం ఆధ్వర్యంలో వివిధ ధార్మిక సంస్థల సమన్వయంతో గీతా ప్రచార సంఘం సభ్యులు సామూహికంగా 701 శ్లోకాలను పారాయణం చేశారు. ఈ సందర్భంగా గీతా ప్రచార సంఘం అధ్యక్షుడు డి.వి.రమణ మాట్లాడుతూ గీత సకల శాస్త్రాల సమ్మిళతం అని, అది మన దగ్గరుంటే అన్నీ మన చెంత ఉన్నట్లే అన్నారు. కార్యక్రమంలో గీతా ప్రచార సంఘం కార్యదర్శులు జగన్నాథ గుప్త, అనంత అనిల్‌కుమార్, ఇల్లూరు వెంకటరమణ, తితిదే ధర్మ ప్రచార పరిషత్ జిల్లా కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకట రెడ్డి, సభ్యులు సింహాద్రి రమేష్, సావిత్రమ్మ, భక్తులు పాల్గొన్నారు.

### పోటాపోటీగా మున్సిపల్ షాపుల వేలాలు

- 11 దుకాణాలకు రూ. 1.34 కోట్లు ఆదాయం



మున్సిపల్ షాపులకు బహిరంగ వేలం నిర్వహిస్తున్న మున్సిపల్ రెవెన్యూ అధికారులు

**కర్నూలు (టౌన్ ) :** మున్సిపల్ షాపుల వేలాలు పోటాపోటీగా సాగాయి. వెంకటరమణ కాలనీలో నూతనంగా నిర్మించిన కేఎంసీ ప్రైడ్ ప్లాజా మున్సిపల్ కాంప్లెక్స్‌లో షాపులకు మంగళవారం స్థానిక నగరపాలక కౌన్సిల్ హాలులో బహిరంగ వేలం నిర్వహించారు. మొదటి విడతలో 10 షాపులకు వేలం నిర్వహించగా, రెండో విడతలో 11 షాపులకు వేలం నిర్వహించారు. ఈ షాపులను దక్కించుకునేందుకు పాటదారులు పోటీ పడ్డారు. మంగళవారం 11 షాపులకు నిర్వహించిన వేలం ద్వారా నగరపాలక రెవెన్యూ విభాగానికి రూ.1.34 కోట్ల ఆదాయం సమకూరింది. ఈ సందర్భంగా నగరపాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ మాట్లాడుతూ మూడు రోజుల పాటు మున్సిపల్ షాపుల వేలాలు ఉంటాయన్నారు. వెంకటరమణ కాలనీలోని కేఎంసీ ప్రైడ్ ప్లాజాతో పాటు ఖాళీగా ఉన్నవి, వాయిదా పడినవి, సీజ్ చేసినవి, 25 సంవత్సరాలు పైబడిన షాపులకు వేలాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.ఆసక్తి గల వారు ధరావత్తు చెల్లించి బహిరంగ వేలంలో పాల్గొనాలన్నారు. నగరపాలక రెవెన్యూ అధికారి జునీద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు రాజేశ్వరరావు, రాజు, వాజిద్ వేలం ప్రక్రియలో పాల్గొన్నారు.

### మాస్‌లైన్ ఆలిండియా యూనిటీ సభను జయప్రదం చేయండి

**కర్నూలు(సెంట్రల్):** మార్చి 3,4,5 తేదీల్లో ఖమ్మంలో జరిగే సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా మాస్‌లైన్ ఆలిండియా విలీన మహాసభను జయప్రదం చేయాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా నాయకులు అర్లప్ప పిలుపునిచ్చారు. మంగళవారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మహాసభకు సంబంధించిన పోస్టర్లను ఆయన విడుదల చేశారు.